## మినీ కథ:

# మేధావి ధనవంతుడు కూలి

సిహెచ్ మధు



హోటల్ నుంచి ఫ్లాస్కుతో టీ తెచ్చి రెండు కప్పులలో పోసి. టేబుల్ పైన పెట్టాడు భూషణం.

ఇరువది రూపాయల నోటు యిస్తే - తిరిగి యిచ్చిన - పది రూపాయల నోటు మిగతా చిల్లరకూడా టేబుల్ పైన పెట్టాడు.

భూషణం పదహేనేళ్ళకు తక్కువ వుంటాడు. నిక్కర్, బుష్షర్ట్ తొడుక్కున్నాడు. తలకు నూనెలేదు. చెప్పుకొన్నట్టుగా వెంట్రుకలు లేవు.

తల్లి తండ్రి లేని భూషణం ఒక రచయిత వద్ద నెలకు ముప్పది రూపాయల జీతానికి పనిచేస్తున్నాడు.

రచయిత ప్రజా రచయితనని చెప్పుకుంటుంటాడు.

భూషణం తన యజమానిని అందరూ ప్రజారచయిత అనటం తెల్సు.

ఆయన రాసింది. చదివింది విన్నాడు. అందులో ప్రజల బాధలు కనిపించాయి.

టేబుల్ ముందు టేబుల్ ఫ్యాన్ తిరుగుతూ వుంది. పగటి పూటే ట్యూబ్ లైటు వేసింది వుంది. టేబుల్ మీద ఒక ఫిల్టర్ సిగరెట్టు ప్యాకెట్, అగ్గిపెట్టె వున్నాయి.

ప్రస్తుతం —

ప్రజా రచయిత రాసిన ఒక నవల హక్కులు ఖరీదు చేయటానికి - ఒక భారీ డిస్ట్రిబ్యూటర్ రచయిత వద్ద కొచ్చాడు.

ఆయన పెద్ద ధనవంతుడు.

టేబుల్ మీద టీ పెట్టగానే "అరేయ్ ఆ బూట్లుతుడవరా" అన్నాడు ధనవంతుడు.

విననట్టు వూరుకున్నాడు భూషణం.

"ఏమిరా చెవులు వినిపించటంలేదా?" అన్నాడు మళ్ళీ ధనవంతుడు.

చూస్తూ నిల్చున్నాడు భూషణం. ఆ పని చేయటం ఇష్టంలేదు.

"సేటు బూట్లు తుడువురా" రచయిత హెచ్చరించాడు.

వినక తప్పింది కాదు. రచయితపైన అసహ్యమేసింది. రచయితను ప్రజారచయిత అంటారుకాని తనకు ఆయనంటే అసహ్యమే. పిల్లవాన్ని సన్ను హీనంగా చూసే రచయిత ప్రజలను గౌరవంగా చూస్తాడా? తాను 'పిల్లవాడని తెల్సికూడా పెద్దవాళ్ళు చేసే పనులు తనతో చేయిస్తాడు. ఏదైనా పని చేయకపోతే - పొరపాటు జరిగితే - తిడుతాడు. బూతులు కూడా. ఒకొక్కసారి రాత్రిపూట కాళ్ళు పట్టించుకుంటాడు. తన దగ్గరున్న పిల్లవాని మీద జాలిలేని రచయితకు ప్రజలంటే అభిమానం ఎలా పుట్టుకొచ్చిందో అర్థం కా లేదు భూషణంకు.

"అరేయ్ నీకు కళ్ళులేవురా?" ధనవంతుడు కోపముతో లేచాడు.

"ఎమిటీ?"

ఆయనకు టీలో వెంట్రుక వచ్చింది.

"ఏమిటీ చూసి తీసుక రావద్దురా."

"నా ఏముంది హోటల్ టీ. నామీద కోపమెందుకూ? రచయిత టీ త్రాగాడు.

ధనవంతుడు త్రాగుతున్న టీ కప్పులో సగం త్రాగగానే వెంట్రుక వచ్చింది.

సగం - టీ - కప్పు టేబుల్ పైన అలాగే పెట్టాడు.

"దొంగ లంజాకొడకా! ఎదురు మాట్లాడుతావా?"

భూషణముకు కోపమొచ్చింది. 'మాటలు మరియాదగా రానీయ్' అన్నాడు.

రచయిత లేచి "ఎవరితో మాట్లాడుతున్నావో గుర్తులేదురా సేటురా ఆయన సేటు"—అంటూ భూషణం చెంప చెళ్ళుమనిపించాడు.

భూషణం కళ్ళు ఎర్రబడ్డాయి కోపంతో వుడికిపోయాడు. టేబుల్ మీదున్న సగం త్రాగిన టీ కప్పును విసురుగా రచయిత ముఖంమీదకొట్టి టేబుల్ మీదవున్న పది రూపాయల నోటు తిసుకొని "నీవు దొంగవు" అంటూ బయటకు పరుగెత్తాడు.

"దొంగ దొంగ దొంగ" అంటూ రచయిత కూడా వాని వెనుక పరుగెత్తాడు.

వాడు దొరుకలేదు.

* *

ఐదు ఏళ్ళ తర్వాత —

భూషణం ఎక్కడున్నాడు?

ప్రజాపోరాటాలమధ్య. ప్రజల మధ్య రేపటి సమానత్వంకోసం బాటలు వేసే మార్గంలో వున్నాడు.

రచయిత —

సాహిత్య అకాడమీ బహుమతుల స్వర్గం మధ్య ఉన్నాడు. ★

